క్లుప్తంగా

జిరాఫీ చెస్ పోటీలు



జిరాఫీ చెస్ పోటీలో చిన్నారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు జిరాఫీ చెస్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ వ్యాయామ విద్య కళాశాల లైబ్రేరియన్ గంగాధర్‌రెడ్డి, విశ్రాంత వైమానిక దళ అధికారి కొండయ్య, గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రాం సాహెబ్, పాఠశాల సిబ్బంది రెహ్మాన్‌ఖాన్, సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తి గేయాలపై శిక్షణ



దేశభక్తి గేయాలపై అవగాహన కల్పిస్తున్న దాదాపీర్

పోరుమామిళ్ల : స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో బుధవారం జేవీవీ జిల్లా కార్యవర్గ సభ్యులు దాదాపీర్ దేశభక్తి గీతాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ దేశాన్ని ప్రేమించడం, సమాజంలో అందరినీ గౌరవించడం జరగాలన్నారు. విద్యార్థులు చిన్నతనంలోనే దేశభక్తి అలవర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా దాదాపీర్ పిల్లలతో దేశభక్తి గేయాలు పాడించారు. కథల పుస్తకాలు చదివించారు. విద్యార్థులు తస్లీం, రితిక, నీహారిక, ఆలియాలు నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ కొండా హుసేన్‌రెడ్డి, లైబ్రేరియన్ ఆఫ్రిది పాల్గొన్నారు.

మ్యూజికల్ చైర్స్ పోటీలు



రాజుపాళెంలో కుర్చీలాట ఆడుతున్న విద్యార్థులు

రాజుపాళెం : వేసవి శిక్షణలో భాగంగా రాజుపాళెంలోని గ్రంథాలయం ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ పోటీలను గ్రంథాలయ అధికారి ఎస్.ప్రతాపుడు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విజ్ఞానంతోపాటు వినోదం అందిస్తుండటంతో మనసు, ఏకాగ్రత నిశ్చలతగా ఉంటుందని తెలిపారు. అలాగే కథలు చెప్పడం, చదువుకోవడం జరిగిందన్నారు. అనంతరం క్యారమ్స్, చెస్ వంటివి ఆడినట్లు ఆయన చెప్పారు.

దివ్యాంగుల సమగ్ర సర్వే



పుల్లారెడ్డిపల్లెలో సర్వే చేస్తున్న ఐఈఆర్‌పీలు

కలసపాడు : మండలంలోని పుల్లారెడ్డిపల్లెలో బుధవారం ఎంఈఓలు ప్రేమ్‌సాగర్, మస్తాన్‌వలి ఆధ్వర్యంలో దివ్యాంగుల సమగ్ర సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇతర విద్యార్థుల వలే మంచి భవిష్యత్తు అందించాలనే ఉద్దేశంతో దివ్యాంగుల సమగ్ర సర్వే సాగుతుందన్నారు. ప్రతి బుధవారం దివ్యాంగులకు ఫిజియోథెరపీ చేయించడం లాంటి కార్యక్రమాలతోపాటు అవసరమైన పరికరాలను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. ఈ సర్వేకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీలు బి.రాజారెడ్డి, కె.జీవన్‌కుమార్‌లు పాల్గొన్నారు.

సమయం పాటించాలి



మహానందిపల్లె సచివాలయంలో బయోమెట్రిక్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కోటేశ్వర్‌రావు

కలసపాడు : సచివాలయ ఉద్యోగులు సమయం పాటించాలని ఎంపీడీఓ కోటేశ్వర్‌రావు తెలిపారు. బుధవారం మండలంలోని మహానందిపల్లె, లింగారెడ్డిపల్లె, పిడుగుపల్లె సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రోజు మూడు సార్లు బయోమెట్రిక్ హాజరు వేయాలని, లేనిచో వేతనంలో కోత విధించడం జరుగుతుందన్నారు. డిప్యూటేషన్‌లో ఉండేవారు కూడా బయోమెట్రిక్ వేసి డ్యూటీ సర్టిఫికెట్ సమర్పించాలన్నారు. డిజిటల్ అసిస్టెంట్స్ సరీస్ పేమెంట్స్ రెండు రోజులకొకసారి రిమిటెన్స్ చేయాలన్నారు. అందరూ అన్ని సరీసులు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ చెంద్రాయుడు, పంచాయతీ సెక్రటరీ వసంతకుమారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈత.. కేరింత



డైవ్ కొడుతున్న క్రీడాకారులు



స్విమ్మింగ్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు

- స్విమ్మింగ్‌లో శిక్షణ
- చిన్నారుల ఆసక్తి
- వేసవి తాపం నుంచి ఉపశమనం

ప్రొద్దుటూరు కల్చరల్ : నీటిలో ఈత కొట్టడం అంటే ఇష్టపడని వారు ఉండరు. చిన్నారులు నీటిలో ఆడుకోవడం అంటే మరింత మక్కువ చూపుతారు. ఈత కొడితే సంపూర్ణ ఆరోగ్యంతోపాటు ఉల్లాసం లభిస్తుంది. ఇటీవలి కాలంలో పలు పర్యాటక ప్రాంతాలు, చెరువులు, బావుల్లో చిన్నారులు నీటిలో దిగి సరదాగా ఆడుకుంటూ ప్రమాదవశాత్తు ఈత రాక ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఎన్నో కనిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని బావులు, చెరువులలో చిన్నా, పెద్దా అందరూ సెలవు దినాల్లో ఈత కొడుతూ ఉల్లాసంగా గడుపుతుంటారు. పట్టణాల్లో చెరువులు, బావులు ఉండకపోవడం వల్ల ప్రజలు స్విమ్మింగ్ పూల్‌లలో ఈత నేర్చుకొనేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆర్టీపీపీ రోడ్డులోని ఎస్‌ఎం న్యూ జ్యోతి హెల్త్ క్లబ్‌లో ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో చిన్నా, పెద్దా అందరూ కలిసి ఈత నేర్చుకుంటున్నారు. పిల్లలకు ఈతపై గల ఆసక్తి తెలుసుకుని.. తల్లిదండ్రులు సైతం స్విమ్మింగ్‌లో వారికి శిక్షణ ఇప్పిస్తున్నారు. ఉదయం 8 నుంచి 9.30 వరకు స్విమ్మింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఈత నేర్చుకోవడం ద్వారా శారీరక దృఢత్వం, పోటీతత్వం చిన్నారులలో అలవడుతాయి. స్విమ్మింగ్ చేయడం వల్ల బీపీ, షుగర్, నడుమునొప్పి, కీళ్ల నొప్పులు తదితర వ్యాధులు దరిచేరవని నిర్వాహకులు తెలిపారు. వేసవి శిక్షణ శిబిరంలో చిన్నారుల నుంచి పెద్దలు కూడా ఈత నేర్చుకొనేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈత పోటీల్లో రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారికి విద్యా, ఉద్యోగ విషయాలలో ప్రభుత్వం రిజర్వేషన్ల సౌకర్యం కల్పించడంతో పిల్లలకు తల్లిదండ్రులు నేర్పిస్తున్నారు. సరదాగా ఈత నేర్చుకుంటున్న చిన్నారులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధిస్తున్నారు. స్విమ్మింగ్‌లో మెలకువలు నేర్పించడంతోపాటు బాబింగ్, బెస్ట్ స్ట్రోక్, బ్యాక్ స్ట్రోక్, ఫ్రీస్టైల్, బటర్‌ఫ్లై తదితర వాటిలో శిక్షణ ఇస్తున్నారు.

వేసవిలో శిక్షణ శిబిరం



తల్లిదండ్రులు తమ పిల్లలకు స్విమ్మింగ్‌లో శిక్షణ ఇప్పించేందుకు ఆసక్తి కనపరుస్తున్నారు. వేసవి శిక్షణ శిబిరంలో 70 మంది పైగా చిన్నారులు శిక్షణ పొందుతున్నారు. పూల్‌లో ఏరోజు కారోజు నీటిని మారుస్తున్నాం. 5 ఏళ్లుగా వేసవి స్విమ్మింగ్ శిక్షణ శిబిరాన్ని నిర్వహించి చిన్నారులకు ఈతలో శిక్షణ ఇస్తున్నాం.

\- ఎస్.ప్రభాకర్‌రెడ్డి, న్యూ జ్యోతి హెల్త్ క్లబ్ నిర్వాహకుడు, ప్రొద్దుటూరు

ప్రతి ఒక్కరూ నేర్చుకోవడం మంచిది



ఈత రోజూ సాధన చేయడం వల్ల శరీర దృఢత్వం చేకూరుతుంది. ఈతలో రాణించిన వారికి ప్రభుత్వం విద్యా, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ సౌకర్యం కల్పించింది. ఈత రాక చాలా మంది నీటిలో దిగి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు అనేకం చూస్తున్నాం. కనుక ప్రతి ఒక్కరూ ఈత నేర్చుకోవడం మంచిదే.

\- సి.రవి, స్విమ్మింగ్ కోచ్

స్విమ్మింగ్ క్రీడాకారిణిగా రాణించాలని..



స్విమ్మింగ్ పై ఆసక్తితో వేసవి శిక్షణ శిబిరంలో చేరి శిక్షణ పొందుతున్నాను. నన్ను నా తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. కోచ్ చెప్పే మెలకువలను శ్రద్ధగా నేర్చుకుంటున్నాను. స్విమ్మింగ్ క్రీడాకారిణిగా రాణించాలని ఉంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు కృషి చేస్తున్నాను.

\- తన్విత‌రెడ్డి, విద్యార్థిని

ఐటీఐ కళాశాలలో ప్రవేశాలు

కలసపాడు : స్థానిక శ్రీషిరిడిసాయిబాబా ఐటీఐ కళాశాలలో 2024–25 సంవత్సరానికి గాను ప్రవేశాలకు అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపల్ కె.రమేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాస్, ఇంటర్మీడియెట్ పాస్ లేక ఫెయిల్, డిగ్రీ పాస్ లేక ఫెయిల్ అయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జూన్ 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 8374009743ను సంప్రదించాలని ఆయన కోరారు.

నేడు అంకాలమ్మ ఆలయ వార్షికోత్సవం

మైదుకూరు : మైదుకూరులో గ్రామ దేవత శ్రీఅంకాలమ్మ ఆలయ 23వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, పూజలు, హోమాలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వినియోగం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

1న మండల సమావేశం

మైదుకూరు : మైదుకూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని జూన్ 1న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎం.ఫజుల్ రహిమాన్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ సమావేశంలో తాగునీరు, పారిశుధ్యం, వ్యవసాయం, రెవెన్యూ, గృహ నిర్మాణం, విద్య, వైద్యం తదితర శాఖలపై సమీక్ష నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

ఎన్నికల కమిషన్ ‘పచ్చ’పాతం

పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ స్టేట్ అడ్వయిజర్ నాగార్జునరెడ్డి



పోరుమామిళ్ల : ఎన్నికల కమిషన్ ‘పచ్చ’పాతంగా వ్యవహరిస్తోందని పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ స్టేట్ అడ్వయిజర్ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఒక రూల్, ఆంధ్రాలో మరో రూల్ అనుసరిస్తోందని పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్‌పై గెజిటెడ్ సంతకం, సీలు లేకపోతే చేత్తో రాయాలని చెప్పారని, అయితే టీడీపీ వారు ఈ నెల 25న పోస్టల్ బ్యాలెట్‌లో గెజిటెడ్ ఆఫీసర్ సంతకం ఉంటే చాలని, సీలు, హోదా లేకపోయినా ఫర్వాలేదనడం, దానిపై జీఓ ఇవ్వడం చూస్తుంటే ఎన్నికల కమిషన్ టీడీపీ చెప్పినట్లు నడుస్తున్నట్లు ప్రజల్లో అనుమానం కలుగుతోందన్నారు. పోలింగ్ రోజు రాష్ట్రంలో 13 చోట్ల ఈవీఎంలు పగులగొడితే ఎక్కడా కేసులు పెట్టలేదని, 20వ తేదీన నారా లోకేష్ నిమిషం వీడియో విడుదల చేస్తే మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై అనేక సెక్షన్లతో కేసులు పెట్టారని పేర్కొన్నారు. గోప్యంగా ఉండాల్సిన సీసీ ఫుటేజీ ఎలా బయటకు వచ్చిందని ప్రశ్నించారు. కొంత మంది పోలీస్ అధికారులు టీడీపీకి అనుకూలంగా పని చేస్తున్నారని, అది సరికాదన్నారు. పోలింగ్ రోజు వ్యవహరించినట్లు కౌంటింగ్ రోజు టీడీపీకి అనుకూలంగా వ్యవహరించకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు.

వంట ఏజెన్సీ నిర్వాహకులకు శిక్షణ



వంటల పోటీల్లో బహుమతులు పొందిన వారితో రీసోర్స్ పర్సన్లు

దువ్వూరు : మండలంలోని వంట ఏజెన్సీ నిర్వాహకులకు, హెల్పర్లకు దువ్వూరులోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రీసోర్స్‌పర్సన్స్‌లు వీరయ్య, వీరారెడ్డి, శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించడంలో వంట ఏజెన్సీల పాత్ర ముఖ్యమైనదన్నారు. వంట విధానం, పరిశుభ్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వంట ఏజెన్సీల నిర్వాహకులు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం విద్యార్థులకు వండి వడ్డించాలని తెలిపారు. వంట ఏజెన్సీల సమస్యలను పరిష్కరించేందుకు అన్ని విధాలా సహకరిస్తామన్నారు. అనంతరం వంట ఏజెన్సీ నిర్వాహకులు, హెల్పర్లకు వంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అదించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు ఆయేషా, ఖదీర్ బాషా పాల్గొన్నారు.

రుతుక్రమంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి

దువ్వూరు : రుతుక్రమం సహజ ప్రక్రియ అని, దీనిపై బాలికలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి పేర్కొన్నారు. అంతర్జాతీయ రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవంలో భాగంగా బుధవారం మండలంలోని ఎర్రబల్లె గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రుతుక్రమ సమయంలో బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరిశుభ్రత పాటించాలని, రుతుస్రావంపై ఉన్న అపోహలను విడనాడాలన్నారు. నెలవారి సమయంలో విశ్రాంతితోపాటు ఐరన్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలని, ఇది శరీరంలో రక్తహీనతను నివారిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం జాస్మిన్, గ్రామ మహిళా సంరక్షకురాలు శ్రీలేఖ, సీహెచ్‌ఓ పవిత్ర, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కల్లూరు వైద్యాధికారి మహాలక్ష్మి తెలిపారు. మండలంలోని సోములవారిపల్లె పంచాయతీలో ఉన్న ఈశ్వరరెడ్డినగర్, పెన్నానగర్‌లలో బుధవారం ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించి మలేరియా, డెంగీ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వచ్చే పారిశుధ్య కార్మికులకు సహకరించాలన్నారు. కాలువల్లో చెత్తా, చెదారం వేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని చెప్పారు. అనంతరం వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్, సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్, సీహెచ్‌ఓ గంగ తులసి, హెల్త్ అసిస్టెంట్ సుబ్బయ్య, ఆరోగ్య కార్యకర్త గాయత్రి, ఆశా కార్యకర్తలు కరుణామణి, శ్రీదేవి పాల్గొన్నారు.

సుంకులమ్మకు ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న సుంకులమ్మ అమ్మవారు

కమలాపురం : పట్టణ పరిధిలోని చెరువు కట్టపై వెలసిన శ్రీ వరాల సుంకులమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న సుంకులమ్మ నవమ బ్రహ్మోత్సవ తిరునాల మహోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఉదయం ప్రాతఃకాల పూజలతో కార్యక్రమాలు ప్రారంభించారు. ప్రముఖ వేద పండితులు పవన్‌కుమార్ ఆచారత్వమున మూలమూర్తికి ఉత్సవ విగ్రహములకు అభిషేకము, తదుపరి ఆవాహిత హోమాలు, విశేషంగా చండీ హోమము, అభిషేకాలు, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. పట్టణం నుంచే కాక సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: రాయలసీమ వ్యాప్తంగా గుర్తింపులేని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆర్‌ఎస్‌ఓ, పిఎస్‌వైఎఫ్, టీఆర్‌ఎస్ విద్యార్థి, యువజన సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం ఆర్‌జేడీ కార్యాలయ ఏడీ అరుణ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా రాయలసీమ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్, ప్రగతిశీల విద్యార్థి యువజన సమైఖ్య రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు, తెలుగు రాష్ట్ర స్టూడెంట్ ఫెడరేషన్ జయరాజ్‌లు మాట్లాడుతూ రాయలసీమ వ్యాప్తంగా గుర్తింపులేని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆదే విధంగా జీప్లస్ 2 ఉండాల్సిన బిల్డింగ్ పర్మిషన్ జీ ప్లస్ 5 వరకు ఏర్పాటు చేసుకుని అక్రమ సంఖ్యలో విద్యార్థులను చేర్పించుకుంటున్నారని ఆరోపించారు. అంతేకాకుండా అడ్మిషన్ ఫీజు పేరుతో ఒకొక్కరి వద్ద నుంచి రూ.3 వేల నుంచి రూ. 5 వేల వరకు అక్రమంగా లాక్కుంటున్నారన్నారు. దీంతోపాటు స్కూల్ బస్సుల్లో కూడా అధిక సంఖ్యలో పిల్లలను ట్రావెల్ చేస్తున్నారన్నారు. వీటన్నింటిపైన విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యాదానం ప్రాధాన్యతను గుర్తించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : విద్యాదానం ప్రాధాన్యతను గుర్తించి చదువుకున్న ప్రతి ఒక్కరూ నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చాలని స్ప్రెడ్ స్మైల్ ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకురాలు శైలాభాను తెలిపారు. బుధవారం జేబీవీఎస్ ది ప్రిజర్వేర్ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక బాలాజీనగర్‌లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యాదానానికి మించి దానం మరొకటి లేదన్నారు. చదువుకుని విద్యావంతులైతే సమాజంలోని మంచి చెడులను తెలుసుకునే వీలు కలుగుతుందన్నారు. ఇలాంటికార్యక్రమాల ద్వారా నిరక్షరాస్యతను నిర్మూలించవచ్చన్నారు. అనంతరం సేవా సమితి వ్యవస్థాపకులు అశోక్, వలంటీర్ సుజితాదేవి చదువుకు గల ప్రాధాన్యతను వివరించారు.

ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

చక్రాయపేట : ప్రభుత్వ ఐటీఐలో 2024–25 విద్యాసంవత్సరంలో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాధాకృష్ణయ్య తెలిపారు. 40 సంవత్సరాల వయస్సులోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. జూన్ 10వ తేదిలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. లేదంటే 10వ తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో ఒక సెట్ జిరాక్స్ పత్రాలు తీసుకువస్తే తమ కళాశాల నుంచి ఉచితంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయిస్తామన్నారు. పూర్తి వివరాలకు 9491056605, 9949621608 నంబర్లను సంప్రదించాలన్నారు.

1న హనుమాన్ జయంతి వేడుకలు





శ్రీపంచముఖ ఆంజనేయస్వామి మూల విరాట్, శ్రీనగరంలోని శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయం

మైదుకూరు : మైదుకూరు పట్టణ శివారులోని శ్రీనగరం వద్ద కర్నూలు–చిత్తూరు జాతీయ రహదారి పక్కన ఉన్న శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో జూన్ 1న హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆలయంలో ఉదయం 5 గంటలకు పంచామృతాభిషేకం, 6కు గణపతి పూజ, ప్రధాన కలశ స్థాపన ఉంటాయి. ఉదయం 8.30కి గణపతి, సుబ్రహ్మణ్య, సుదర్శన, నవగ్రహ, శ్రీపంచముఖ ఆంజనేయస్వామి హోమాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12.15 గంటలకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వినియోగం, సాయంత్రం 5కు శ్రీపంచముఖ ఆంజనేయస్వామి గ్రామోత్సవం ఉంటుంది. ఉదయం జరిగే హోమాల్లో దంపతులు పాల్గొనాలని నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీపంచముఖ ఆంజనేయస్వామి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల : పట్టణ శివారులోని శ్రీ అభయాంజనేయస్వామి దేవస్థానంలో జూన్ 1న హనుమాన్ జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శెట్టెం చెన్నయ్య తెలిపారు. భక్తులు, దాతల సహకారంతో అనేక రకాల కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఉదయం దేవస్థానంలో పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. పట్టణంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి 108 మంది మహిళలు కలశాలతో ఊరేగింపుగా అభయాంజనేయస్వామి గుడికి మేళ తాళాలు, చిన్నారుల కోలాట ప్రదర్శనతో శోభాయాత్ర కొనసాగుతుందన్నారు. ఆలయ ఆవరణలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయని, మధ్యాహ్నం అన్నదానం ఉంటుందన్నారు.

రతనాల వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రతనాల వేంకటేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీలలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామున వెంకటేశ్వరస్వామి మూలవిరాట్‌కు విశేష పూజలు చేశారు. శ్రీదేవిభూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామి, స్వామివారి చెల్లెలు లలితాదేవి ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. సాయంత్రం మహిళలు సామూహికంగా కుంకుమార్చనలు చేసి కర్పూర హారతులు ఇచ్చారు. భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది.

భూకబ్జాలపై విచారణ జరపాలి



మాట్లాడుతున్న భూపోరాట కమిటీ కన్వీనర్ నారాయణ

బద్వేలు అర్బన్ : పట్టణంలోని మడకలవారిపల్లె, చెన్నంపల్లె గ్రామ పొలాల్లోని పలు సర్వే నంబర్లలో జరిగిన భూకబ్జాలపై విచారణ జరపాలని భూపోరాట కమిటీ కన్వీనర్ పి.నారాయణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో కొంత మంది నకిలీ పట్టాలు తయారు చేసి రెవెన్యూ అధికారుల అండదండలతో యథేచ్ఛగా కబ్జాలకు పాల్పడుతున్నారని, దీనిపై విచారణ జరిపించాలని కోరారు. భూ కబ్జాలపై, ఇందుకు సహకరిస్తున్న రెవెన్యూ అధికారులపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అలాగే నకిలీ పట్టాల సూత్రధారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, లేనిపక్షంలో ప్రజా సంఘాల తరఫున ఆందోళనలు చేపడతామని అన్నారు. సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, నాగార్జున, కేవీపీఎస్ నాయకులు రాయప్ప, మహిళా సంఘం నాయకులు మోక్షమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠ భరితంగా క్రికెట్ టోర్నీ



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకుంటున్న అబ్దుల్లా

నందలూరు : నందలూరు ప్రీమియర్ లీగ్ 8వ సీజన్ ఉత్కంఠ భరితంగా కొనసాగుతోంది. నాగిరెడ్డిపల్లె పంచాయతీ అరవపల్లెలోని నందలూరు జెడ్పీహెచ్‌ఎస్ క్రీడా మైదానంలో ఈ టోర్నీని నిర్వహిస్తున్నారు. బుధవారం జరిగిన మ్యాచ్‌లో క్రేజీ లెవన్స్ నందలూరు జట్టుపై వినాయక లెవన్స్ నాగిరెడ్డిపల్లె జట్టు విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన వినాయక జట్టు 14 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 152 పరుగులు చేసింది. వినాయక జట్టు ఆటగాడు అబ్దుల్లా 9 సిక్సర్లు, 4 ఫోర్లతో 46 బంతుల్లో 91 పరుగులు చేశాడు. అనంతరం బరిలో దిగిన నందలూరు జట్టు 14 ఓవర్లలో 7 వికెట్లను కోల్పోయి 142 పరుగులు చేసి పరాజయం చెందింది. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన అబ్దుల్లాకు సీనియర్ క్రికెటర్లు పత్తి శంకర్, కిరణ్‌లు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను అందించారు.

పాటూరుపై మునక్కాయలపల్లి విజయం..

మధ్యాహ్నం పాటూరు, మునక్కాయలపల్లి జట్ల మధ్య మ్యాచ్ రసవత్తరంగా సాగింది. మొదట బ్యాటింగ్ చేసిన మునక్కాయలపల్లి జట్టు 14 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 164 పరుగులు చేసింది. హరి 43, కార్తీక్ 38, ఎస్‌ఐ మహ్మద్ అబ్దుల్ జహీర్ 31 పరుగులు చేశారు. అనంతరం 165 పరుగుల విజయ లక్ష్యంతో బరిలో దిగిన పాటూరు జట్టు 14 ఓవర్లలో 141 పరుగులకు ఆలౌట్ అయ్యింది. బ్యాటింగ్‌తోపాటు బౌలింగ్‌లోనూ రాణించిన కార్తీక్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను అందజేశారు. ఈ మ్యాచ్‌కు శివకోటి, మున్నాలు అంపైర్లుగా, అఫ్సర్, దినేష్‌లు స్కోరర్లుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్స్ పల్లె గ్రీష్మంత్ రెడ్డి, ముమ్మడిశెట్టి సుధాకర్, రంజిత్, క్రీడాకారులు పాల్గొన్నారు.